క్లుప్తంగా

మంత్రి విశ్వరూప్‌ను కలసిన ఆర్డీఓ



మంత్రి విశ్వరూప్‌కు మొక్క అందజేస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

అమలాపురం రూరల్: ఇటీవల ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన జి.కేశవవర్ధన్‌రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. భట్నవిల్లి గ్రామంలో మంత్రి నివాసంలో విశ్వరూప్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆర్డీఓ మొక్కను అందించారు.

ఎంపీ అనురాధను..

అల్లవరం: అమలాపురం ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన కేశవవర్ధన్‌రెడ్డి మొగళ్లమూరులోని ఎంపీ నివాసంలో ఎంపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి మొక్కను అందించారు. ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన కేశవవర్ధన్‌రెడ్డికి ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు

ఐ.పోలవరం: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపులు వైభవంగా జరిగాయి. మండలంలో మురమళ్ల, టి.కొత్తపల్లి, కేశనకుర్రు, ఐ.పోలవరం, కొమరగిరి, ఎదుర్లంక, తిళ్లకుప్ప, జి.మూలపొలం, జి.వేమవరం తదితర గ్రామాల్లో ఏర్పాటైన ఉత్సవ మండపాల్లో కనకదుర్గమ్మ, అమ్మవార్ల విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. మురమళ్లలో అమ్మవారి ప్రతిమను పల్లకిలో ఊరేగింపుగా వృద్ధ గౌతమీ గోదావరి వరకూ మేళతాళాలతో తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులు, కోలాటాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి.

విలు విద్యపై శిక్షణ

అమలాపురం టౌన్: స్థానిక సహస్ర స్కూల్‌లో విద్యార్థులకు విలు విద్యపై శిక్షణ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ తరగతులను స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు ప్రారంభించారు. జాతీయ స్థాయి విలు విద్య పోటీల్లో బంగారు, రజత పతకాలను కైవసం చేసుకున్న ఈదరపల్లికి చెందిన కర్రి బుద్ధేశ్వరరావు ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ గౌసియా బేగం, పీఈటీ మోహినమ్మ, ఆర్.సత్యకుమార్ పాల్గొన్నారు.

పి.మల్లవరం హైస్కూల్‌కు చేయూత



పి.మల్లవరం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న రవీంద్ర

తాళ్లరేవు: పి.మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా విశ్రాంత మేనేజర్ వుంగరాల రవీంద్ర రూ.50 వేలను బుధవారం అందజేశారు. ఈ మేరకు ఆ పాఠశాలలో హెచ్‌ఎం పాలెపు వెంకట శ్రీనివాసరావుకు చెక్కు ఇచ్చారు. ఈ నగదును తాళ్లరేవు యూనియన్ బ్యాంకులో జమ చేసి వచ్చే వడ్డీని ప్రతి ఏడాది పదో తరగతిలో 4, 5, 6 స్థానాలలో నిలిచే విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు అందజేయాలని రవీంద్ర కోరారు. కార్యక్రమంలో ఏఎస్ మూర్తి, ధూళిపూడి వెంకటరమణ, ధూళిపూడి శుభ, వుంగరాల బూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

28న జలస్తంభన దీక్ష

తాళ్లరేవు: గౌతమి గోదావరిలో ఈ నెల 28న జలస్తంభన దీక్ష చేయనున్నట్లు పిల్లంక గ్రామానికి చెందిన వేద పండితుడు వేలూరి వెంకట కామేశ్వరశర్మ (కాశిబాబు) బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోపులంక పుష్కర ఘాట్ వద్ద ఇటీవల నలుగురు యువకులు గోదావరిలో స్నానానికి దిగి మృత్యువాత పడిన నేపథ్యంలో వారి ఆత్మకు శాంతి కలగాలని అక్కడే దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. తన గురువర్యులు ఆశీర్వాదంతో పొందిన ఉపాసనా మంత్ర జపాన్ని గ్రహణం పట్టు సమయం నుంచి విడుపు సమయం వరకూ నీటిపై తేలియాడుతూ ఆ యువకులకు ఉత్తమ గతులు పొందేలా ఆ దేవున్ని ప్రార్థిస్తూ ఈ దీక్ష చేయనున్నట్లు కాశిబాబు వివరించారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

అల్లవరం: మండలంలోని గోడి, గోడిలంక, కొమరగిరిపట్నం, గుండెపూడి, తాడికోన, తూర్పులంక, ఎంట్రుకోన గ్రామాల్లో ఈ నెల 28 వరకూ ఆధార్ సవరణ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమోహన్ బుధవారం తెలిపారు. పదేళ్ల కిందట ఆధార్ నమోదు చేసుకున్న వారు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రచార మహోత్సవం

రావులపాలెం: ఏపీఎస్‌ఆర్టీసీ గురువారం నుంచి వచ్చే నెల 25 వరకూ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం నిర్వహిస్తుందని రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ బుధవారం తెలిపారు. పార్సిల్ డోర్ డెలివరీ సౌకర్యాన్ని వినియోగదారులు అందరూ మరింతగా వినియోగించుకోవాలన్నారు.

అందరికీ ఆరోగ్యం.. అదే సౌభాగ్యం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన



అనాతవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: అందరికీ ఆరోగ్యం.. ప్రతి ఇంటికీ సౌభాగ్యమని, అందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ముమ్మిడివరం మండలం అనాతవరం-2 సచివాలయ పరిధిలో సర్పంచ్ మిమ్మిత్తి చిరంజీవి సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా నిపుణులైన వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని, అవసరమైన వారికి మెరుగైన వైద్యానికి ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారన్నారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అన్నిరకాల వ్యాధులకు రక్త పరీక్షలు, గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. అందరూ ఆరోగ్యంగా జీవించాలనే సదుద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం 801 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, పెన్మత్స చిట్టిరాజు, జగతా పద్మనాభం, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పులిదిండి సుజాత, వైస్ ఎంపీపీ పాము నాగవేణి, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఈటీపీఆర్ సీహెచ్ కల్యాణి, పులిదిండి గాలం నాథ్, జేవీవీ సత్యనారాయణ, వైద్యులు వినీల్, స్వరూపరాణి, కృష్ణ, వంశీచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఐ.పోలవరం: ప్రజల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అన్నారు. బుధవారం జి.మూలపొలం సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ సంపూర్ణ ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమన్నారు. మండలంలో ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 503 మందికి వైద్యులు ఇందిరాశ్రీ, టి.ఆదిత్య పవన్, రమ్య, టి.పవన్ సేవలు అందించారు. ల్యాబ్ టెస్టులు 171, కంటి పరీక్షలు 40 మందికి చేశారు. జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ మందపాటి విజయలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం కోయిలక్ష్మి, మందపాటి భైరవస్వామి, వత్సవాయి రామకృష్ణ, ముదునూరి ఫణిరాజు, ఎంపీడీఓ డి.రాంబాబు తదితరులు ఉన్నారు.

అల్లవరం: గుండెపూడి సచివాలయం వద్ద సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయడమే కాకుండా వ్యాధి నిర్ధారణ అనంతరం ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల మనిషి అని అన్నారు. ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గుంటూరి కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ పినిపే ప్రకాశరావు, మాజీ ఎంపీటీసీ కొపనాతి వెంకటేశ్వరరావు, నాయకులు గుంటూరి బాలరాజు పాల్గొన్నారు.

381 మందికి వైద్య పరీక్షలు

తాళ్లరేవు: జార్జీపేట పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ గుత్తుల సత్యవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 381 మందికి గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులు జయభార్గవి, ఈశ్వర్, సురేష్‌కుమార్ తదితర బృందం పరీక్షలు చేసింది. రోగులకు సర్పంచ్ సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉచితంగా మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, విశ్రాంత వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.



జి.మూలపొలం వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



గుండెపూడిలో ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్, సర్పంచ్ కృష్ణంరాజు



జార్జీపేటలో గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సత్యవేణి

శక్తిరూపిణి.. ముక్తిప్రదాయిని

- ముగిసిన దేవీ నవరాత్రులు
- ఆలయాల వద్ద అన్న సమారాధనలు



మొగళ్లమూరులో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ అనురాధ



పత్తిగొందిలో కనకదుర్గమ్మ విగ్రహ ఊరేగింపు

అల్లవరం: శక్తిరూపిణి.. ముక్తిప్రదాయినిగా కొలిచే ఆ దుర్గమ్మ శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ఆ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించగా, భక్తులు తిలకించి పులకించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మొగళ్లమూరు సెంటర్లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ఎంపీ అనురాధ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవగుప్తం సెంటర్లో విజయదుర్గమ్మ వారి ఉత్సవాల సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది. అనంతరం శక్తివేషాలు, తీన్‌మార్ డప్పులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. సామంతకుర్రు, డి.రావులపాలెం గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారిని ఊరేగించారు.

ఉప్పలగుప్తం: కూనవరం గ్రామంలో దుర్గాభవాని అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గురువారం అన్నసమారాధన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అమలాపురం టౌన్: స్థానిక సావరం బైపాస్ రోడ్డులో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి సన్నిధిలో మంత్రి, ఎమ్మెల్సీ



బండారులంకలో దుర్గాదేవిని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: బండారులంకలోని నారాయణరావుపేటలో దుర్గాదేవి అమ్మవారిని మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. కామనగరువు జీఎస్‌ఆర్ కాలనీలో నవరాత్రి మహోత్సవపేటలో అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. మంత్రి, ఎమ్మెల్సీలను ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, దంగేటి బుల్లబ్బులు, ఎంపీటీసీ గుత్తుల జానకీలక్ష్మి సత్కరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు గుత్తుల ఏసుబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత

దసరా శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో వారు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, మున్సిపల్ కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, దొమ్మేటి రాము తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో నెలకొల్పిన విజయ దుర్గాదేవి విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లి పత్తిగొంది కాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి నిత్యావసరాల పంపిణీ



బాధితుడికి ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ఇటీవల రోళ్లపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితుడు రాయుడు సత్యనారాయణ కుటుంబ సభ్యులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. అలాగే నిత్యావసరాలు, దుస్తులను బుధవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (నాని), పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, కొల్లాటి దుర్గాబాయ్, నాయకులు నక్కా చంద్రశేఖర్, ఈతకోట శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పి.గన్నవరం: ఊడిమూడి గ్రామంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఊడిమూడి గ్రామానికి చెందిన కొల్లు దుర్గరాజు(26)కు గతంలో వివాహం జరిగింది. ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఇటీవల భార్య, భర్తల మధ్య మనస్పర్థల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి దుర్గరాజు మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం అతడు ఊడిమూడి గోదావరి గట్టుకు వెళ్లి పురుగు మందు తాగాడు. అనంతరం చిన్నాన్న గోవిందు సెల్‌కు ఫోన్ చేసి తాను పురుగు మందు తాగినట్టు దుర్గరాజు చెప్పాడు. దీంతో గోవిందు, తాతయ్య కొల్లు సుబ్బారావు ఏటిగట్టు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే దుర్గరాజు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతడిని తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి, అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతదేహానికి అదే ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని తాత సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం

- శ్రీదేవి మార్కెట్ పందిరిలో ప్రదర్శన
- రాత్రి అంతా తిలకించిన ప్రేక్షకులు



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

సాక్షి అమలాపురం: జిల్లా కేంద్రం అమలాపురంలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక రంగస్థల నాటక ప్రదర్శన విశేషంగా అలరించింది. శ్రీదేవి మార్కెట్ వీధిలోని శ్రీదేవి నవరాత్రుల మహోత్సవాల 44వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఉత్సవ పందిరిలో పలు నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ రంగస్థల నటులతో భారీ వ్యయంతో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన నిర్వహించారు. అభినవ హరిశ్చంద్ర, నటరాజశేఖర బిరుదాంకితుడు జూనియర్ డీవీ సుబ్బారావు హరిశ్చంద్ర నాటకం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గొప్ప పేరు గడించింది. డీవీతో పాటు విశ్వామిత్రునిగా ఆచంట బాలాజీనాయుడు, చంద్రమతిగా కిలారు లక్ష్మి, నక్షత్రకునిగా పద్మశ్రీ వై.గోపాలరావు, మొదటి హరిశ్చందునిగా కృష్ణచైతన్య తదితర ప్రముఖ తారాగణంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. దానితో కోనసీమ వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో రంగస్థల ప్రియులు తరలివచ్చారు. వారణాశి, కాటి సన్నివేశంలో హరిశ్చంద్రునిగా డీవీ నట విశ్వరూపాన్ని ప్రదర్శించారు. అలాగే రాజ్యం, అడవి సన్నివేశాల్లో హరిశ్చంద్రునిగా కృష్ణచైతన్య, నాలుగు సన్నివేశాల్లోనూ చంద్రమతిగా కిలారు లక్ష్మి, అభినవ విశ్వామిత్రునిగా బాలాజీనాయుడు తమదైన శైలిలో డైలాగులు, పద్యాలను వల్లించారు. నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. ఆది నుంచి తుది వరకూ ఈ నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 9.30 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటలకు ప్రదర్శన పూర్తయ్యే వరకూ ఆసక్తిగా తిలకించారు. దీంతో మళ్లీ నాటక రంగ స్థలానికి పూర్వ వైభవం కనిపించింది.

బాలాజీ సన్నిధిలో హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్



చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టీలు

మామిడికుదురు: రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ ఎం.సీతారామమూర్తి కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్న అనంతరం చైర్మన్ సీతారామమూర్తికి అర్చకులు స్వామివారి వేదాశీర్వచనం అందించారు. స్వామివారి శేషవస్త్రం బహుకరించి, చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ట్రస్టీలు కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, ఆలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

28న ఆలయం మూసివేత

పాక్షిక చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 28వ తేదీ శనివారం అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ జి.మాధవి బుధవారం తెలిపారు. 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి ఆలయాన్ని మూసి వేసి, ఆలయ సంప్రోక్షణ, సేవల అనంతరం 29న తెరుస్తామని ఆమె చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి యథావిధిగా భక్తుల దర్శనాలు కొనసాగుతాయన్నారు.

ముఖద్వారం ప్రారంభం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న పార్వతీ రాజేశ్వరిస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామివారి ముఖ ద్వారాన్ని బుధవారం ప్రారంభించారు. మాచవరం-అవిడి వెళ్లే ప్రధాన రహదారిలో స్వామివారి ముఖద్వారాన్ని అప్పన వెంకటరాజు కుటుంబీకులు నిర్మించినట్టు ఆలయ అర్చకులు మాచరి సూర్యనారాయణ, గ్రామస్తులు తెలిపారు. తొలుత సూర్యనారాయణ స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అప్పన కుటుంబీకులు పాల్గొన్నారు.

తుపాను రక్షిత భవనాలను సంరక్షించాలి



ఎన్.కొత్తపల్లిలో తుపాన్ రక్షిత భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

ఉప్పలగుప్తం: మండలంలోని తుపాను రక్షిత భవనాలను సంరక్షించాలని ఆర్డీఓ జి.కేశవవర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎస్.కొత్తపల్లి, ఎస్.యానం, చల్లపల్లి గ్రామాల్లోని తుపాను రక్షిత భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. రానున్న రోజుల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో తీర ప్రాంతాల ప్రజలను సంరక్షించడానికి ముందస్తుగా చర్యలు చేపట్టాలని అన్నారు. భవనాలకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, డీటీ వైవీవీఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న సీఐ కొండయ్య తదితరులు

ముమ్మిడివరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ విద్యార్థులు 10 పతకాలు సాధించారు. ఇటీవల అమలాపురంలో జరిగిన ఈ పోటీల్లో ఉమెన్స్ విభాగంలో ఎం.శ్రేయ రెండు బంగారు పతకాలతో స్ట్రాంగ్ ఉమెన్‌గా టైటిల్ సాధించారు. దొమ్మేటి వేణు మణికంఠ బ్రెంచ్ ప్రెస్ లో గోల్డ్ మెడల్, సాగర్ సిల్వర్ మెడల్, ఎం.లక్ష్మణ్ బ్రాంచ్ పతకం, ఏవీవీ సత్యనారాయణ రెండు బ్రాంచ్ మెడల్స్ సాధించారు. విజేతలను ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, జిమ్ నిర్వాహకుడు వాసంశెట్టి నరేష్ అభినందించారు. గణపతి, చిట్టూరి ప్రవీణ్, విత్తనాల నవీన్, ఇందుగుల కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బోనస్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి అడ్‌హక్ బోనస్ ప్రకటిస్తూ బుధవారం ఆర్థిక శాఖ కార్యదర్శి అర్జున్ రామకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఇది పుదుచ్చేరిలో ఉద్యోగులందరికీ వర్తించే విధంగా ఆదేశాలిచ్చారు. ఆ విధంగా నెలకు రూ.7 వేల చొప్పున బోనస్ అందనుంది.

బదిలీల కౌన్సెలింగ్ పూర్తి

యానాం: స్థానిక విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 61 మంది ట్రైన్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ)లకు బుధవారం బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేసినట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడి సమగ్రశిక్షా బీఆర్‌సీ హాల్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు వివిధ పాఠశాలల టీచర్లు హాజరయ్యారు.

మత్స్యకారులకు రుణాలు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా కిసాన్ క్రెడిట్ రుణాలను బోటు యజమానులకు బ్యాంకుల ద్వారా మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారికి రుణాలు మంజూరవుతున్నాయని ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. బుధవారం సావిత్రీనగర్ గ్రామానికి చెందిన బోటు యజమాని అరదాడి వీరబాబుకు కిసాన్ క్రెడిట్ రుణం రూ.1.60 లక్షలను ఇండియన్ బ్యాంకు యానాం శాఖ ద్వారా మంజూరు చేశారు. దీనికి సంబంధించిన మంజూరు ఉత్తర్వులను బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ, ఆర్‌ఏఓ మునిస్వామి సమక్షంలో అందజేశారు.

యువకులకు కౌన్సెలింగ్

తాళ్లరేవు: మద్యం తాగి యానాం నుంచి కారులో వస్తున్న యువకులకు పోలేకుర్రు చెక్‌పోస్టు వద్ద పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్రమ మద్యం తరలిపోకుండా పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలలో భాగంగా బుధవారం కొందరు యువకులు కారులో బీర్లు తాగుతూ కనిపించారు. ఈ నేపథ్యంలో వారిని కిందకు దింపి వారి వద్దఉన్న మద్యాన్ని వారితోనే కిందకు పారబోయించి ఎస్ఈబీ ఎస్సై జగ్గారావు కౌన్సెలింగ్ ఇచ్చి విడిచిపెట్టారు.

28న షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపికలు

కొత్తపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన కొత్తపేటలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి తెలిపారు. బుధవారం వారు స్థానిక ఎంఆర్‌సీలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక కాంతిభారతి హైస్కూలు ఆవరణలో నిర్వహించే షూటింగ్ బాల్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగాలలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆ రోజు ఉదయం 9 గంటలకు స్థానిక కాంతిభారతి హైస్కూలులో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

చెక్కు అందజేత

అంబాజీపేట: చిరతపూడిలో సర్పంచ్ కోట బేబి రాణి అధ్యక్షతన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దార్లంక ఆకాంక్షకు రూ.2 లక్షలు, కొడమంచలి పుష్పావతికి రూ.30 వేలు చెక్కులను అందజేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, పలివెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.